www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

ఆదివారం
11.10.2026

నేడు అటుకుల బతుకమ్మ



ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి కోజు ఈ అటుకుల బతుకమ్మ వేడుక జరుగుతుంది. తంగేడు పూలు, గునుగు పూలు, బంతిపూలు, చామంతి, అడవి గడ్డి పూలతో రెండు ఎత్తుల్లో బతుకమ్మను పేరుస్తారు. ఈ అటుకుల బతుకమ్మ పండుగ కోజు సప్పిడి పప్పు, బెల్లం, అటుకులు వంటివి బతుకమ్మకు నైవేద్యంగా సమర్పిస్తారు.

చుక్కనీరు కూడా వృథా కావొద్దు

రాబోయే 8 నెలలు అత్యంత కీలకం


ఎల్‌నినోతో సంక్షోభం రాకుండా చర్యలు

తెలంగాణను ఎల్‌నినో ముప్పు వెంటాడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం, 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో తాగు, సాగునీటితో పాటు విద్యుత్ సంక్షోభం ముంచుకొచ్చే ప్రమాదం ఏర్పడింది. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కొవిడ్ తరహాలో పటిష్ట ముందస్తు కార్యాచరణకు సిద్ధమైంది. వచ్చే ఏడాది జూన్ వరకు పరిస్థితులను అధిగమించేందుకు నీటి వృథాను అరికట్టడం, విద్యుత్ పొదుపు, ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటుపై దృష్టి సారించింది. అటు కరవు మండలాలను ఆదుకునేందుకు కేంద్రం రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని, ఉపాధి హామీ పనిదినాలను 175 రోజులకు పెంచాలని కోరుతూ సమగ్ర నివారణ చర్యలపై సర్కారు దృష్టి సారించింది.

కలంజ్యోతి, బ్యూరో



- కొవిడ్ తరహాలో పటిష్ట యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి
- కేంద్రం రూ.20 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి
- ఉపాధి హామీ పనిదినాలు 175 రోజులకు పెంచాలి
- సీఎం రేవంత్‌రెడ్డి



4లో..



- ప్రభుత్వానికి రూ.600 కోట్ల నష్టం
- తక్కువ కోట్ చేసిన వారిని కావాలనే తప్పించారు
- ఐదు రోజుల్లోనే బిడ్ల కేటాయింపు ఎలా సాధ్యం
- టెండర్ల పూర్తి రికార్డులను బహిర్గతం చేయాలి
- మూడేళ్ల కాంట్రాక్టులపై కాగ్ ఆడిట్ జరపాలి

: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3లో..

రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయాలి

ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు

తెలంగాణ సంస్కృతి, ప్రకృతితో ముడిపడిన పూల పండుగ బతుకమ్మ సంబరాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ ఉత్సవాల్లో ఆడపడుచులు తీరొక్క పూలతో గౌరమ్మను కొలుస్తూ, కోలాటాలు, ఆటపాటలతో సందడి చేస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లోని ఆలయాలు, కూడళ్లలో పండుగ శోభ వెల్లివిరియగా, ప్రభుత్వం సైతం ట్యాంక్ బండ్ సహా ప్రధాన కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు చేపట్టింది.

- తీరొక్క పూలతో గౌరమ్మకు పూజలు
- అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ
- ట్యాంక్ బండ్‌పై భారీ ఏర్పాట్లు

లోపలి పేజీల్లో..



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
ఆదివారం 11.10.2026
www.kalamjyothi.com

ప్రారంభమైన బతుకమ్మ సంబురాలు

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 10) : తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సాంస్కృతిక అస్తిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లు, కోలాటాలతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడితో పాటు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు వైభవంగా సాగాయి.

అక్టోబర్ 18న సద్దుల బతుకమ్మ..

శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగియనున్నాయి. అనంతరం అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ మహిళలు, విద్యార్థినులు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ఘనంగా చాటుతున్నారు.

ట్యాంక్ బండ్‌పై భారీ ఏర్పాట్లు..

ఈ ఉత్సవాల కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు.



ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 10) : తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎస్ఆర్ బాలికల జూనియర్ కళాశాల, ఐఐటి అకాడమీల ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో కళాశాలకు హాజరై, వివిధ రకాల రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేశారు. బతుకమ్మలను చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. విద్యార్థినుల సందడి, రంగురంగుల బతుకమ్మలతో కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో సంస్థల డి జి ఎం గోవర్ధన్ రెడ్డి , జోనల్ ఇంఛార్జి నాగేశ్ యాదవ్, అకడమిక్ డీన్ రాంబాబు, ప్రిన్సిపల్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, మన సంస్కృతి వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కూడా విద్యార్థినులతో కలిసి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినుల సృజనాత్మకత, సంప్రదాయ దుస్తులు, బతుకమ్మ పాటలు, నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



రంగురంగుల పూలతో మహిళల ఆటపాటలు

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 10) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మహిళలు తెలిపారు.



శివపరాశక్తి పీఠంలో విశేష పూజలు

శాస్త్రోక్తంగా పరమశివునికి పంచామృతాభిషేకాలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని శివపరాశక్తి పీఠం పితృ అమావాస్య సందర్భంగా శివనామస్మరణతో మారుమోగింది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పీఠంలో పరమశివునికి భక్తిశ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మ విభూతి అభిషేకం, ప్రత్యేక అన్నాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

సప్తహారతుల దర్శనం, అన్నప్రసాద వితరణ..

పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి సమర్పించిన సప్తహారతులు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం పీఠం ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు శివపరాశక్తి పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ ఆశీస్సులు అందజేశారు. పితృ అమావాస్య పర్వదినాన నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పీఠం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.



అన్నప్రసాద వితరణకు ఏడాది పూర్తి

నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సేవా సమితి వ్యవస్థాపకులు రాజు దేశ్‌పాండే ఆదేశాల మేరకు ప్రతి అమావాస్య రోజున రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని వివిధ ప్రాంతాల్లో స్థానిక అయ్యప్ప మాలధారులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం శనివారం నాటికి ఏడాది పూర్తి చేసుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా గరిపెల్లి అశోక్ మాతృమూర్తి కీర్తిశేషులు సరోజన జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులు, గురుస్వాములు పందిర్ల శ్రీనివాస్ గౌడ్, చకిలం మధుగుప్తా, కందుకూరి రవీందర్, శ్రీరామోజు శేఖర్ మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని, సేవాభావంతో ప్రతి అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ కొనసాగిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు బాపురెడ్డి, రాజు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

3

ఆదివారం 11.10.2026

www.kalamjyothi.com

రేడియల్ రోడ్డు-2 టెండర్లు రద్దు చేయాలి



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 11) : రాష్ట్రంలో చేపట్టిన రేడియల్ రోడ్డు2 ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, వాటిని తక్షణమే రద్దు చేసి సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. రూ.3,296 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో కావాల్సిన కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డులోని బుద్వేల్ నుంచి కొడంగల్ సమీపంలోని ఎన్‌హెచ్ 167ఎన్ వరకు నిర్మించ తలపెట్టిన 81.15 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పనులను ప్యాకేజీలుగా విభజించి, తమకు అనుకూలమైన సంస్థలకు కట్టబెట్టారని తన లేఖలో పేర్కొన్నారు. తక్కువ ధరకు బిడ్లు దాఖలు చేసిన వారిని అనర్హులుగా ప్రకటించి, అంచనా వ్యయం కంటే ఎక్కువ ధరకు పనులు కేటాయించడం వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.600 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఐదు రోజుల్లోనే బిడ్లను ఎలా కేటాయిస్తారు?

సెప్టెంబర్ 30న బిడ్ల దాఖలుకు గడువు ముగియగా, కేవలం ఐదు పని దినాల్లోనే అంటే అక్టోబర్ 8 నాటికి టెక్నికల్ ఎవాల్యుయేషన్, అర్హతల పరిశీలన, ఫైనాన్షియల్ బిడ్ల ప్రారంభం, పనుల కేటాయింపు పూర్తి చేయడంపై కేటీఆర్ సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన 13 బిడ్లను ఇంత తక్కువ సమయంలో ఎలా ప్రాసెస్ చేశారని ప్రశ్నించారు. ప్యాకేజీI పనులను ఎన్‌సీసీ లిమిటెడ్‌కు అంచనా వ్యయం కంటే 3.95 శాతం అధికంగా రూ.1,286.03 కోట్లకు కేటాయించారని, ప్యాకేజీII బీవీఎస్ఆర్‌కు, ప్యాకేజీIII జీకేసీకి అప్పగించారని తెలిపారు. అంచనా వ్యయాలు, కోట్ చేసిన ధరలు, బిడ్డర్ల అనర్హతకు గల నిర్దిష్ట కారణాలు, తుది కాంట్రాక్ట్ విలువలు, టెక్నికల్ ఎవాల్యుయేషన్ నివేదికలతో సహా అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

కాగ్ ఆడిట్‌తో పాటు
శ్వేతపత్రం విడుదల చేయాలి..

గత మూడేళ్లలో హెచ్‌ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కేటాయించిన రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)తో ప్రత్యేక ఆడిట్ జరిపించాలని, టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ కోరారు. ప్రాజెక్టులో పారదర్శకత లోపించిందని, ప్రభుత్వానికి తీవ్ర నష్టం వాటిల్లేలా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. కేటీఆర్ రాసిన ఈ లేఖతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కాంట్రాక్టులలో పారదర్శకతపై రాజకీయ చర్చ మరింత తీవ్రమైంది.

ప్రభుత్వానికి ఆర్టీసీ ఫలితాలు గొడ్డలిపెట్టు

హామీలు అమలు చేయకుంటే వ్యతిరేకత తప్పదు

బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 10) : ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వానికి గొడ్డలిపెట్టు లాంటివని, ప్రభుత్వంపై ఉద్యోగుల వ్యతిరేకత స్పష్టంగా బయటపడిందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. కార్మిక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓటమి పాలైందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అమలు చేయకుండా కంటితుడుపు చర్యగా మూడు డీఏలకు గాను రెండు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. గత రెండేళ్ల పెండింగ్ డీఏ ఏరియర్స్‌ను అక్టోబర్ నెల వేతనంతో కలిపి ఇవ్వకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో ఇస్తామని చెప్పడం ఉద్యోగులను మోసగించడమేనని విమర్శించారు. ఉద్యోగులను, నిరుద్యోగులను మోసం చేయడం సర్కారుకు అలవాటుగా మారిందని, రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నిరుద్యోగుల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత తప్పదని, బీఆర్ఎస్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి విజయం ఖాయమని పేర్కొన్నారు.



పట్టభద్రుల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపు టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత

కలంజ్యోతి, మహబూబాబాద్ (అక్టోబర్ 10) : నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మహబూబాబాద్ రూరల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నాయకులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన కీలక అంశాలపై నాయకులతో చర్చించారు. పట్టభద్రుల ఓటర్ల ఎన్రోల్మెంట్‌ను పెద్దఎత్తున చేపట్టి, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ తరఫున బరిలో నిలిచే అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి ప్రధాన కార్యాలయంలో తొలి ఎన్రోల్మెంట్ చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని,ప్రభుత్వ,కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేకపోయిందని ఆరోపించారు.పలు యూనివర్సిటీల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోందని విమర్శించారు.

ఏడు నియోజకవర్గాల్లో భారీగా ఎన్రోల్మెంట్..

మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఎన్రోల్మెంట్‌ను పెద్దఎత్తున చేపడతామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లోని నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలకు తగిన ప్రాధాన్యత కల్పించేలా పార్టీ తరఫున ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేయాలని కవితను కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి నాయకులందరూ సమిష్టిగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి బిక్షపతి, వెలిగేటి రవి, సీనియర్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, శ్రీశైలం, హర్షిత్, రాము, సంతోష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



సీఈసీ రాజీనామా చేయాల్సిందే

ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 10) : కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మినీ ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ ప్రభుత్వానికి వంత పడుతూ సర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వక్తలు ఆరోపించారు. ఈ నిరసనలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్, ఖానాపూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కూచాడి శ్రీహరిరావు, ఇంద్రకరణ్ రెడ్డి, ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఈ వ్యవహారంలో జ్ఞానేశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు మద్దతు తెలుపుతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి, నిర్మల్ మునిసిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఎంబడి రాజేశ్వర్,ఇండియా కూటమి నాయకులు,సిపిఐ ఎంల్ జిల్లా కార్యదర్శి, కట్ట రాజన్న, లక్ష్మి, హరిత, విలాస్, బొమ్మెన సురేష్, నంది రామయ్య, అర్జుమంద్ అలీ, సోమా భీమ్ రెడ్డి, అబ్దుల్ హాది, ఆనంద్ రావు పాటిల్, రాంరెడ్డి, సమర సింహారెడ్డి, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 11.10.2026
4
www.kalamjyothi.com



చుక్కనీరు కూడా వృథా కావొద్దు

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 10) : ఎల్‌నినో ప్రభావం వల్ల అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తమైంది. భవిష్యత్తులో రాబోయే తీవ్రమైన నీటి, విద్యుత్, వ్యవసాయ సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తక్షణ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. శనివారం ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. కొవిడ్ సమయంలో అనుసరించిన వ్యూహం తరహాలోనే ఎల్‌నినోపైనా పటిష్ట కార్యాచరణ ఉండాలని, వచ్చే ఏడాది జూన్ రుతుపవనాలు వచ్చే వరకు పరిస్థితులను అంచనా వేస్తూ ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

రాబోయే 8నెలలు అత్యంత కీలకం..

రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని అధిగమించడంలో అత్యంత కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో సరైన ప్రణాళికలు లేకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మార్కెట్‌లో విద్యుత్ లభ్యత తక్కువగా ఉందని, కొనుగోలుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్లో తగినంత విద్యుత్ దొరకడం లేదన్నారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ ఆధారిత ఇతర పనులను వాయిదా వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

చుక్క నీరు కూడా వృథా కావొద్దు..

రైతులు వేసిన పంటలు చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూస్తూ, చుక్క నీరు కూడా వృథా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేయాలని, సినిమా, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు ప్రత్యేకంగా వార్ రూమ్‌తో పాటు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని, సీఎంఓ ఉన్నతాధికారులు విద్యుత్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. దసరా పండుగ తర్వాత గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కేంద్రం రూ.20 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి..

రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం, దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంపై యంత్రాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో కరవు మండలాలను అధికారికంగా ప్రకటించడంతో పాటు బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని ఇప్పటికే అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. కరవు ఉపశమన చర్యలకు కేంద్రం తగిన ఆర్థిక సాయం అందించి బాసటగా నిలవాలని రాష్ట్రప్రభుత్వం మరోసారి డిమాండ్ చేసింది.

ఉపాధి హామీ పనిదినాలు 175 రోజులకు పెంచాలి..

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద లభించే 125 రోజుల పనిదినాలకు అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ అదనపు ఉపాధికి అయ్యే ఖర్చును భరించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్
మండల అధ్యక్షుడు బండి హరీష్

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 10) : గ్రామస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి యువకులు సమన్వయంతో కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ, సొసైటీ డైరెక్టర్ కేతిడి వీరారెడ్డి సమక్షంలో బండి హరీష్ ఆధ్వర్యంలో జల్లి, అమృ తండా, ధర్మ తండా గ్రామాల్లో యువజన కాంగ్రెస్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్ కుమార్, మండల అధ్యక్షుడు బండి హరీష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న రోజుల్లో యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని తమ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో యువకులు కీలక పాత్ర పోషించాలని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అన్నారు.

మూడు గ్రామాల్లో నూతన కమిటీల ఎన్నిక

జల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వంగపల్లి చిన్న రాజు, ఉపాధ్యక్షులుగా జక్క రవి, అంగోతు శ్రీపాల్, ప్రధాన కార్యదర్శిగా సింగారపు ప్రదీప్ కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మెండే విజేందర్ ఎన్నికయ్యారు. అమృ తండా అధ్యక్షుడిగా బోడ సాగర్, ఉపాధ్యక్షులుగా జాటోతు బన్నీ, బానోత్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ సాయి కుమార్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లుగా బోడ సాగర్, బానోత్ గణేష్ ఎన్నికయ్యారు. ధర్మ తండా అధ్యక్షుడిగా బాధావత్ వీరన్న, ఉపాధ్యక్షుడిగా భూక్య శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బాధావత్ కిరణ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా భూక్య సంతోష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వీరా సింగ్, బోడ రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు బాధావత్ బాలు, శంకర్, వెంకన్న, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య భాస్కర్, సొసైటీ డైరెక్టర్ అంబాల రవి, కుర్ర బాబు, ఇంద్ల సునీల్, భాస్కర్ నాయక్, అంబాల డాన్, శ్రీను, గాదె కర్ణాకర్, వీరన్న నాయక్, రాజు, రమేష్, శ్రీనివాస్, నాంపల్లి రవీందర్, యట శ్రీను, జరుపుల ప్రవీణ్, కిషన్ నాయక్, చీకటి రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.





చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : చేపలు, తాబేళ్లు పట్టేందుకు స్నేహితులతో కలిసి చెరువులోకి వెళ్లిన ఓ యువకుడు నీటమునిగి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులో జరిగింది. వెంకటాపూర్ గ్రామానికి చెందిన మోతే ఎల్లయ్య, ఎల్లవ్వ దంపతుల కుమారుడు మోతే కిరణ్ స్నేహితులతో కలిసి చెరువులోకి దిగాడు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి వెళ్లి నీటమునిగాడు. నిన్న గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం మోతే కిరణ్ మృతదేహాన్ని సీఐ ఓ వెంకటేష్, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, 17వ ఐఆర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పి సి జె పి చటర్జీ, అసిస్టెంట్ సిఎంటి రాందాస్, ఇంచార్జ్ శ్రీనివాస్, ఇంచార్జ్ ఆర్ఎస్ఐ శేఖర్ ఆదేశాల మేరకు సర్దాపూర్ 17వ బెటాలియన్ డిఎస్పీ రాందాస్ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది చాకచక్యంగా వెలికితీశారు.

రెస్క్యూ బృందానికి అధికారుల ప్రశంసలు..

గంటల వ్యవధిలోనే ఆపరేషన్ పూర్తి చేసిన ఎస్డీఆర్ఎఫ్ బృందం సాహసానికి అధికారులు అభినందనలు తెలిపారు. క్లిష్టమైన సమయంలో వేగంగా స్పందించి, ఎంతో బాధ్యతాయుతంగా రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేసిన డిఎస్పీ రాందాస్, ఆర్ఎస్ఐ శేఖర్ బృందం పనితీరును ఉన్నతాధికారులు కొనియాడారు. విధి నిర్వహణలో సిబ్బంది ప్రదర్శించిన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, ఇలాంటి సంసిద్ధత ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ హైదరాబాద్ నుండి, ఎస్సై రమేష్ స్టేషన్ నుండి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కిరణ్‌కు భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న కిరణ్ మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

చెరువులో పడి యువకుడి మృతి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : వెంకటాపూర్ గ్రామ శివారులోని అవుసుల రామయ్య కుంట చెరువులో మోతే కిరణ్ (33) మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మోతే ఎల్లయ్య, ఆయన కుమారుడు మోతే కిరణ్ స్క్రాప్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ ఉదయం గ్రామానికి చెందిన మోతే స్వామి, కంకణాల అంజి పని ఉందని కిరణ్‌ను వెంట తీసుకెళ్లారు. సాయంత్రం సమయంలో చెరువు కట్టపై కిరణ్‌కు చెందిన ద్విచక్రవాహనం, దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్ ఉన్నట్లు బంధువులకు సమాచారం అందింది. దీంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకుని పరిశీలించి, నీటిలో పడి ఉండవచ్చనే అనుమానంతో గాలింపు చేపట్టారు.

మృతిపై అనుమానాలు, పోలీసుల దర్యాప్తు..

ఈ క్రమంలో శనివారం ఉదయం చెరువులో కిరణ్ మృతదేహం లభ్యమైంది. ఘటనకు ముందు రోజు కిరణ్‌తో పాటు మోతే స్వామి,



కంకణాల అంజి ముగ్గురూ చెరువు సమీపంలో మద్యం సేవించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం చెరువులో ఈతకు దిగడం వల్ల ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే అనుమానాలను వ్యక్తం చేశారు. మృతుడి తండ్రి మోతే ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై ఎన్. రమేష్ తెలిపారు.

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

5

ఆదివారం 11.10.2026

www.kalamjyothi.com



యాదవ సంఘాల బలోపేతానికి కృషి

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా సాగాలి

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 10) : మండలంలోని గ్రామాల్లో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీకృష్ణ గోపాల మండల యాదవ సంఘం అధ్యక్షుడు ఓరుపుల రాములు తెలిపారు. మండలంలోని సోమారంపేట, అనంతగిరి గ్రామ యాదవ సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవ సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల యాదవ బంధువులు ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యాదవుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాలరాజు, కార్యదర్శి అజయ్, కోశాధికారి రాజశేఖర్, జొర్ర రాజయ్య, సోమరంపేట యాదవ సంఘం అధ్యక్షుడు పలమారు కుంటయ్య, ఉపాధ్యక్షుడు సంకటి మల్లయ్య, కార్యదర్శులు వంగ తిరుపతి, తిరుపతి, పూజారి ఓజయ్య, అనంతగిరి గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ అరుకాల నవీన్ యాదవ్, ఉపాధ్యక్షుడు మీసం శ్రీనివాస్ యాదవ్, యార మల్లయ్య, అరుకాల కొమురయ్య, ఎలుకపెల్లి మల్లయ్య, యార శ్రీనివాస్, తూముల మల్లేశం, యార ఎల్లయ్య, నూనె మల్లయ్య, యార అంజయ్య, యార కుమారస్వామి, యార కృష్ణ, యార మహేందర్ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ అండ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 10) : మండల కేంద్రానికి చెందిన బొంత సురేష్ మృతి చెందడంతో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డి 50 కిలోల బియ్యాన్ని పంపించారు. సొసైటీ డైరెక్టర్ జునూతుల మహేందర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, విషాద సమయంలో వారికి మనోధైర్యంగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంత రాజు, బొంత కొమురయ్య, ఉప్పునూతుల రాజు, సిద్ధ క్రాంతి, ననుమాస శ్రీకాంత్, గుంజె అశోక్, తడక రాజాగౌడ్, ఎదురబోయిన చిరు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా బావిలో దూకి తల్లి ఆత్మహత్య

కలంజ్యోతి, కురవి (అక్టోబర్ 11) : మండలంలోని లింగ్యా తండాలో కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భర్తతో మనస్పర్థలు తలెత్తడంతో ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలతో కలిసి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కురవి ఎస్‌హెచ్‌ఓ బోలగాని సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు నవీన్, బానోతు అనూష (32)లకు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అనూష తండ్రి సోదరుడు గతంలో మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్న తల్లి వద్దే నవీన్, అనూష దంపతులు పిల్లలతో కలిసి నివసిస్తూ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబంలో ఆర్థిక సమస్యలు తలెత్తడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల పెద్దమనుషులు పంచాయతీ నిర్వహించి అత్తగారింటి నుంచి వేరుగా ఉండాలని సూచించినప్పటికీ మళ్లీ వివాదాలు తలెత్తాయి. తీవ్ర మనోవేదనకు గురైన అనూష శనివారం తన పిల్లలైన రీత్విక (9), విశాల్ కృష్ణ (4)లను తండా శివారులోని వ్యవసాయ బావిలోకి తోసేసి, అనంతరం తాను కూడా దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.



వైభవంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 10) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు మండల కేంద్రంతో పాటు అక్కల్‌చెడ, పాపయ్యపేట, జల్లీ, పాతమగ్గూంపురం తదితర గ్రామాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా గ్రామాల్లోని మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తంగేడు, గునుగు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల సంప్రదాయ దుస్తులు, రంగురంగుల పూల బతుకమ్మలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.



అంగడి బజారులో అంబరాన్నంటిన సంబురాలు..

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట అంగడి బజారులో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేడుకల్లో భాగంగా తంగేడు, గునుగు, బంతి, పట్నం బంతి, పట్టుకుచ్చు, తామర పువ్వు, గుమ్మడి పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో, దేవాలయాల ఎదుట, గ్రామ ప్రధాన కూడళ్లలో మహిళలు నూతన వస్త్రాలు ధరించి ఎంతో సంబరంగా ఒకచోట చేరారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ, ఒక్కేసి పువ్వేసి సందమామ ఒక్క జాములో సందమామ, చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా అందాల బొమ్మ దొరికెనమ్మో ఈ వాడలోన అంటూ బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ముగిసిన అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. అనంతరం మహిళలు ఒకరికొకరు పిండివంటలు, తీపి వంటలను వాయనాలుగా ఇచ్చిపుచ్చుకున్నారు.





ఆటాపాటలతో హోరెత్తించిన మహిళలు

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 10) : మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సంబరాల్లో భాగంగా తంగేడు, గునుగు, బంతి, పట్నం బంతి, పట్టుకుచ్చు, తామర, గుమ్మడి పూలతో బతుకమ్మలను విశేషంగా అలంకరించారు. ఆలయాల ఎదుట, గ్రామ కూడళ్లలో మహిళలు నూతన వస్త్రాలు ధరించి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ, ఒక్కేసి పువ్వేసి సందమామ, చిత్తు చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మా వంటి పాటలతో ఉత్సాహంగా ఆడిపాడారు. వేడుకలు ముగిసిన అనంతరం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఆపై మహిళలు ఒకరికొకరు తీపి, పిండివంటలను వాయనాలుగా ఇచ్చిపుచ్చుకున్నారు.



కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నా..

టాలీవుడ్ నటి నివేదా థామస్ నూతన చిత్రం శ్రీమతి చిత్రీకరణ ప్రారంభంపై సామాజిక మాధ్యమాల్లో స్పందించారు. 35 చిన్న కథ కాదు చిత్రంతో మెప్పించిన ఆమె, విశ్వక్ ఖండేరావ్ దర్శకత్వంలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఫ్యామిలీ డ్రామా శ్రీమతితో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. షూటింగ్ మొదలవుతున్న సందర్భంగా ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నానని, అది సుపరిచితమైనదే అయినా ప్రత్యేకమైన శైలిని కలిగి ఉందని పేర్కొన్నారు. కొత్త సెట్‌లో మొదటి రోజు సమీపిస్తుండటంతో ఒకరకమైన ఆందోళన, సినిమా మొదలుపెట్టాలనే ఉత్సాహం కలుగుతున్నాయని, ఒక అమ్మాయి చిత్రీకరణకు బయలుదేరిందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.